వైద్యమందక శిశువు మృతి

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని గత్తుం పంచాయతీ చీకటి పుట్టు గ్రామంలో మూడు నెలల బాబుకు సకాలంలో వైద్య అందక మృతి చెందాడు.. తల్లిదండ్రులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గత్తుం పంచాయతీ చీకటి పుట్టు గ్రామానికీ చెందిన సీదరి దేవి, జ్ఞాన్ సుధన్ దంపతుల మొదటి కాన్పు 3నెలలు బాబు. ఈ బాబుకు ఆరోగ్యం బాగోలేదని గ్రామ వాలంటీర్ సహాయం తో 108 అంబులెన్స్ ద్వారా పాడేరు జిల్లా హాస్పిటల్‌కు బుదవారం సాయంత్రం ఏడు గంటలకు తరలించారు. హాస్పిటల్లో చిన్నపిల్లలు డాక్టర్స్ సకాలంలో రాలేక మరణించినట్లు తల్లిదండ్రులు పేర్కొన్నారు. బాబు ఎందుకు చనిపోయాడని డాక్టర్ గుర్తించలేదని వారు వాపోయారు. జిల్లాస్పత్రిలోనే మరణాలు జరుగుతుండటంపై ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు శిశు మరణాలకు అదుపు చేయడానికి పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించాలని వారు కోరారు.

శిశువు మృతదేహం

పాడేరు ఘాట్‌రోడ్డులో ప్రయాణం.. భయం.. భయం..

-రక్షణ గోడలు శిథిలం
-చేపట్టని జంగిల్ క్లియరెన్స్
-ప్రమాదాల బారిన పడుతున్న వాహనాలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరు ఘాట్ రోడ్డులో ఆదివారం ఆర్‌టిసి బస్సు లోయలో పడిపోయిన ఘటన జిల్లా వాసులను కలవరపరిచింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలవ్వడం తెలిసి ఉలిక్కి పడ్డారు. ఘాటీలో ప్రయాణం ఎంత క్షేమం అన్న ప్రశ్న ఇప్పుడు సర్వత్రా ఉత్పన్నమవుతోంది. ముఖ్యంగా పాడేరు ఘాట్ మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అటు వాహనాలు నడిపే డ్రైవర్లకు, ఇటు ప్రయాణికులకు రోత పుట్టిస్తున్నాయి. ఘాటీలో తరచూ ప్రమాదాలు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఘాటి రోడ్డుకు ఇరువైపులా దట్టంగా తుప్పలు, చెట్లు విపరీతంగా పెరగడంతో వాహనాలకు దారి ఇవ్వడం ఒక సమస్య అయితే, మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాన్ని గుర్తించలేకపోవడం మరో సమస్యగా మారింది. దీంతో ఘాట్‌లో ఏమాత్రం అప్రమత్తంగా లేకపోయినా అంతే సంగతులు. పలుచోట్ల పొదలు, చెట్ల కొమ్మలు రోడ్డుపైకి విస్తరించాయి. ప్రమాదకరమైన మలుపుల వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు, దూరాన్ని తెలియజేసే మైలురాళ్లు కూడా కనిపించలేదు. సింగిల్ లైన్ రోడ్డు కావడం, ఆర్ అండ్ బి అధికారులు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టక పోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.


ప్రమాదకర మలుపు

పలు మండలాలకు రాకపోకలు

పాడేరు నుంచి చోడవరం, అనకాపల్లి, విశాఖ నర్సీపట్నం మైదాన ప్రాంతాలకు రాకపోకలు సాగించాలంటే ఘాట్ ప్రయాణం తప్పనిసరి. పాడేరు మండలం మినుములూరు నుంచి వి.మాడుగుల మండలం గరికిబంధ వరకు సుమారు 25 కిలోమీటర్లు ఘాట్ మార్గంలోనే ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఏజెన్సీలో పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు, డుంబ్రిగూడ మండలాలతో పాటు ఒడిశా రాష్ట్రానికి చెందిన వందలాది వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. వంజంగి హిల్స్, కొత్తపల్లి జలపాతం తదితర పర్యాటక ప్రదేశాలను సందర్శించడానికి వచ్చే పర్యటకుల వాహనాలు కూడా ఈ మార్గంలోనే వస్తుంటాయి.

శిథిలమైన రక్షణ గోడ

పెరిగిన వాహనాల రద్దీ

పాడేరు జిల్లా కేంద్రం కావడంతో గతంలో పోల్చితే ఈ మధ్య వాహనాల రాకపోకలు మరింతగా పెరిగాయి. దీంతో నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే స్థానిక ఘాట్ మార్గంలో జంగిల్ క్లియరెన్స్ చేయడంలో నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని డ్రైవర్లు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

తుప్పల తొలగింపులో నిర్లక్ష్యం..

ప్రతి ఏడాది వర్షాకాలం తరవాత ఘాట్‌లో విధిగా జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలి. కానీ, ఈ ఏడాది జంగిల్ క్లియరెన్స్ చేపట్టడంలో నిర్లక్ష్యం చూపడంతో ఘాట్ అంతా తుప్పలే దర్శన మిస్తున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వర్షాలు కురుస్తున్నప్పటికీ ఎటువంటి జంగల్ క్లియర్స్ చేపట్టక పోవడంతో ఘాట్ మార్గంలో తుప్పలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో, ఘాట్‌లోని రోడ్డు పక్కకు వాహనాన్ని దింపలేని పరిస్థితి ఏర్పడింది.


ఘాట్‌రోడ్డులో ప్రమాదకంరగా ఉన్న చెట్లు

ముఖ్యంగా మలుపుల వద్ద ఎక్కువగా చెట్లు, చెట్ల కొమ్మలు, తుప్పలు మొలిచి పోవడంతో మలుపుల్లో ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడక ఎక్కువ ప్రమాదాలకు ఆస్కారమిస్తున్నది. దీంతో, మలుపుల వద్ద ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్న ప్రమాదాలు తప్పవని వాహన చోదకులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఘాట్ మార్గంలో ప్రమాదకరంగా మారిన తుప్పలను తొలగించాలని డ్రైవర్లు, ప్రయాణికులు కోరుతున్నారు.

శిథిలావస్థలో రక్షణ గోడలు..

ఘాట్‌లో నిర్మించిన రక్షణ గోడలు ధ్వంసం కావడంతో పాడేరు ఘాట్ రోడ్డు ప్రయాణం ప్రమాదకరంగా మారింది. పలుచోట్ల మలుపుల వద్ద రక్షణ గోడలు శిథిలావస్థకు చేరాయి. దీంతో ప్రయాణాలకు వాహన చోదకులు భయాందోళన నడుమ ప్రయాణాలు సాగిస్తున్నారు. ఆయాచోట్ల రక్షణ గోడలు లేకపోవడంతో ప్రయాణం ప్రమాదపరితంగా మారింది. మలుపుల వద్ద వందల అడుగులలోయలు ఉండడంతో ప్రయాణాలకు వాహన చోదలకు భయాందోళన చెందుతున్నారు. ఏమాత్రం ఆదమరచి ప్రయాణించిన ప్రమాదాల బారిన పడక తప్పదని చెబుతున్నారు. ప్రమాదాలు పొంచి ఉన్నందున రక్షణ గోడలను పటిష్టం చేసి ప్రయాణికుల భద్రత కోసం చర్యలు తీసుకోవాలి. అధికారుల స్పందించి శిథిలావస్థకు చేరుకున్న రక్షణ గోడలు ప్రదేశంలోని, రక్షణ గోడలు లేని చోట్ల నూతన గోడలను నిర్మించి ప్రమాదాల నివారణకు రక్షణ చర్యలు చేపట్టాలని వాహన చోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్‌గనోరే

పక్కాగా భూముల రీ సర్వే

- ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని ప్రభుత్వ, రైతులకు సంబంధించిన భూములకు రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం పక్కాగా రీ సర్వే చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంకాలం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్లు, మండల సర్వేయర్లతో ఐటిడిఎ పిఒ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు జగనన్న భూ హక్కు భూరక్ష ప్రోగ్రామ్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ సర్వే అండ్ సెటిల్మెంట్ కమిషనర్ వారి ఆదేశాల మేరకు టార్గెట్ ప్రకారం ప్రతి గ్రామంలో రీ సర్వే చేయాలన్నారు. ఈ రీ సర్వే చేసిన భూములకు ఎక్కడికక్కడ హద్దులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఒక్కొక్క మండలానికి టార్గెట్ ప్రకారం ఎన్ని గ్రామాల్లో సర్వే పూర్తయింది ఇంకా ఎన్ని గ్రామాలలో సర్వే చేయవలసి ఉన్నది ఆయన ఆరా తీశారు. ఒక్కొక్క మండలం పరిధిలోని గ్రామాలలో ఎన్ని ఎకరాల భూమి ఉన్నది, ఎంతమంది సర్వే టీమ్‌లు పనిచేస్తున్నవి, ఎన్ని సర్వే మిషన్లో పనిచేస్తున్నాయో తెలుసుకున్నారు. సర్వే చేసిన భూములన్నింటికి సంబంధిత రైతులకు సంతృప్తి పొందినది లేనిది నోటీసులు ఇచ్చి గ్రామాలలో సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సర్వే చేసిన భూములన్నింటికీ ముందుగా వీఆర్వోల లాగేన్‌లో పొందుపరచాలన్నారు. మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్లు రవి శంకర్, నాగభూషణం, బాబురావు, రాజశేఖర్, ఏడు మండలాలకు సంబంధించిన మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

వృద్ధురాలికి నిత్యావసర బియ్యం, సరుకులు, నగదు అందజేస్తున్న తహశీల్దారు శ్రీధర్

పింఛను నిలిచిపోయిన వృద్ధురాలికి తహశీల్దారు ఆర్థిక సహకారం

ప్రజాశక్తి-విఆర్.పురం

ఆధార్ కార్డులో సాంకేతిక లోపం కారణంగా ఏడాది కాలంగా పింఛను నిలిచిపోయిన వృద్ధురాలికి తహశీల్దారు దయాహృదయంతో ఆర్థిక సహకారం అందించారు. మండలంలోని చిన్నమట్టపల్లి గ్రామ పంచాయితీకి చెందిన వృద్ధురాలు గుటల సీతమ్మకు ఆధార్ కార్డులో సాంకేతిక లోపం కారణంగా సంవత్సర కాలంగా వృద్ధాప్య పింఛన్ నిలిచిపోయింది. దీంతో ఆమెకు పూట గడవడం చాలా కష్టంగా మారింది. సీతమ్మ పరిస్థితి గురించి తెలుసుకున్న తహశీల్దారు ఎన్.శ్రీధర్ తన సొంత డబ్బులతో 50 కేజీల బియ్యం, మంచి నూనె, పాలు, కంది పప్పుతో పాటు రూ.2 వేలు నగదు గురువారం అందజేశారు. తన పరిధిలో ఎక్కడ సమస్య ఉన్నా వెంటనే దానిని తీర్చే హృదయం గల తహశీల్దారు శ్రీధర్ అని స్థానిక ప్రజాప్రతినిధులు అంటున్నారు. గోదావరి వరద ముంపు సమయంలోనూ ఎంతో శ్రమించి వరద బాధితులకు తనదైన శైలిలో సేవలందించారు. ఎంతోమందికి తన సొంత డబ్బుతో చేయూతనిచ్చారని గ్రామస్తులు అంటున్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్, ఎడ్యుకేషన్ సహాయకులు ఎస్.రవికుమార్, విఆర్ఎ.ప్రసాద్, వాలంటీర్లు, ఎం.మీనా, యు.లక్ష్మణరావు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో వివిధ పథకాల కింద అర్హులైన 3066 మంది లబ్ధిదారులకు రూ.3కోట్ల 53 లక్షల 19 వేలు ద్వైవార్షిక నగదును లబ్ధిదారుల ఖాతాలకు జమ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వెల్లడించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆయన క్యాంపు కార్యాలయం నుండి నవరత్నాలు ద్వైవార్షిక నగదు మంజూరుపై ప్రత్యక్ష ప్రచారాన్ని గురువారం కలెక్టరేట్ నుండి వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అమ్మఒడి పథకం కింద 378 మంది లబ్ధిదారులకు రూ.56 లక్షల 70 వేలు, చేదోడు 592 మందికి 59 లక్షల 20 వేలు, ఈబిసి నేస్తం 13 మందికి రూ.1లక్ష 95 వేలు, జగనన్న విద్యాదీవెన కింద 625 మందికి రూ.58 లక్షల 65 వేల 398, జగనన్న వసతి దీవెన 783 మందికి రూ.84 లక్షల 60 వేల 600లు, రైతు భరోసా 15 మందికి రూ.58 వేలు, వైఎస్సార్ క్రాంతి పథం ఆసరా కింద 660 స్వయం సహాయ సంఘాలకులు రూ.91 లక్ష 49 వేల 960లను లబ్ధిదారులకు ఖాతాలకు ముఖ్యమంత్రి జమ చేసారని చెప్పారు. లబ్ధిదారులకు నమూనా చెక్కు పంపిణీ చేసారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డిఏ, పిడి వి.మురళి, పలువురు ఎపిఎంలు, స్వయం సహాయ సంఘాల సభ్యులు, పలువురు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

రేకుల షెడ్డు పాఠశాల ముందు ఉన్న విద్యార్థులు

రేకుల షెడ్డులో చదువులు!

-వర్షాలకు లోనికి చేరుతున్న నీరు
-అవస్థలు పడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి -అనంతగిరి: పాఠశాలలల్లో నాడు నేడు పనులు మన్యంలో కానరాలేదు.గిరిజన ప్రాంతంలో మాత్రం కనీసం పాఠశాల భవనం లేక మట్టి గోడలతో నిర్మించిన రేకుల షెడ్డు కింద విద్యా బోధనలో సాగిస్తున్న దుస్థితి నెలకొంది. మండలంలోని వేంగడ పంచాయతీ డొంకగపుట్టు గ్రామంలో మండల పరిషత్ పాఠశాల ఉంది. నేటికీ పాఠశాలకు భవనం లేదు. ఈ పాఠశాలకు డాలింగ్ పుట్టు, మెట్టపాడు, పెన్నంతి, డొంకపుట్టు గ్రామాలకు చెందిన 67 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.పది అడుగులు కలిగిన పాఠశాల రేకు షెడ్డులో 67 మంది విద్యార్థులు ఇరుకు గద్దిలో చదువులు కొనసాగిస్తున్నారు. వర్షాకాలంలో రేకులు మరమ్మతులకు గురి కాతవడంతో వర్షపు నీరు చేరడంతో నేలపై కూర్చోలేని పరిస్థితితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 2022 సంవత్సరంలో నాడు నేడు కింద సుమారు రూ 16 లక్షల నిధులు మంజురైనప్పటికీ పనులు మాత్రం జరగలేదు. దీంతో, పాఠశాలకు భవనం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

పట్టించుకునే నాథుడేడీ : సిపిఎం

ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాదుడే కరువుయ్యారని వేంగడ పంచాయతీ సిపిఎం మాజీ సర్పంచ్ సివేరి .కొండలరావు అన్నారు. పాఠశాల భవనం లేక 67 మంది విద్యార్థులు ఇరుకు రేకుల షెడ్డు వద్ద చదువులను కొనసాగిస్తున్నారని, కలెక్టర్, .పిఒ, సంబంధిత విద్యాశాఖ అధికారులకు కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకున్న నాధుడే కరువయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులతో కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామన్నారు.

పాడేరులో వర్షం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో గురువారం వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ వాతావరణం కొనసాగి, ఆ తర్వాత వాతావరణం మారి పోయింది. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఒక మోస్తరు వర్షం కురిసింది. రెండు గంటలసేపు కురిసిన వర్షానికి పాడేరు పట్టణం తడిచి ముద్దయింది. వర్షం కురవడంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. వర్షానికి పట్టణంలోని రోడ్లు వీధులు జలమయమయ్యాయి. చిరు, వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు.

కురుస్తున్న వర్షం

పరిశీలించిన తరువాత టెండర్ల ఖరారు

గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్‌రాజ్

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని గిరిజన ఆశ్రమం పాఠశాలలకు నాణ్యత గల నిత్యావసర సరుకులు తక్కువ ధరకు అందించేందుకు వేసిన టెండర్లను పరిశీలించి ఖరారు చేయడం జరుగుతుందని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రాజ్ పేర్కొన్నారు. గురువారం సాయంకాలం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని 11 మండలాలకు సంబంధించిన గిరిజన ఆశ్రమ పాఠశాలలకు నిత్యావసర వస్తువులు సరఫరా చేయుటకు టెండర్లు వేసిన నేపథ్యంలో ఎటిడబ్ల్యుఒలు, జిసిసి గోదాముల ఇన్‌ఛార్జులు, జిసిసి డివిజనల్ మేనేజర్, జిసిసి సీనియర్ మేనేజర్లతో గిరిజన సంక్షేమ శాఖ డీడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు ఈ టెండర్ల ప్రక్రియ నిర్వహించడం జరిగిందని తెలిపారు. చింతూరు డివిజన్ రంపచోడవరం డివిజన్ల పరిధిలోని ఆశ్రమ పాఠశాలలకు నిత్యావసర సరుకులు సరఫరా చేయుటకు ఐదుగురు టెండర్లు వేసినట్లు చెప్పారు. టెండర్లు ఖరారైన తరువాత ఎప్పటికప్పుడు నాణ్యమైన నిత్యావసర సరుకులు ఆశ్రమ పాఠశాలలకు సకాలంలో చేరవేసే బాధ్యత వారిపై ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటిడబ్ల్యుఒలు కె.సుజాత, హాసిని, జిసిసి డివిజనల్ మేనేజర్లు పార్వతీశ్వరరావు, మధు, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ పరిపాలన అధికారి బి.కిషోర్, సీనియర్ మేనేజర్లు ముళ్ళ నాగ వెంకట రాజారెడ్డి, విజయలక్ష్మి, చంద్రశేఖర్, జిసిసి గోదాముల ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న గిరిజన సంక్షేమశాఖ డీడీ జాన్‌రాజ్, అధికారులు

ప్రధాన రహదారిపై పశువుల గుంపు

ఇబ్బంది పడుతున్న వాహనచోదకులు

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని రేఖపల్లి నుండి భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారిపై ధర్మతాళ్ళగూడెం గ్రామం వద్ద వందల సంఖ్యలో పశువులు రోడ్డుకు అడ్డంగా సంచరిస్తున్నాయి. ప్రధాన రహదారిపైనే గుంపులుగా సంచరిస్తూ, పడుకోవడం, అనుసంధానంగా ఉన్న రహదారులకు ఇరువైపులా పశువులు చేరటంతో తరచూ రోడ్డుప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అలాగే పశువులు విసర్జించిన పేడ వల్ల అపరిశుభ్రత ఏర్పడుతుంది. దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉంది. అలాగే బస్ షెల్టర్ కూడా పశువులకు నిలయంగా మారింది. ఈ సమస్యలపై పంచాయతీ అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. విఆర్ పురం గ్రామం నుండి ఒడ్డుగూడెం వెళ్లే రోడ్డు గుంతల పడి వర్షాలకు ఆ గుంటల నుండి మురికి నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయి. రోడ్డుకు ఇరువైపుల ఆక్రమణ వలన ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది. వీటిపైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రేఖపల్లి- భద్రాచలం ప్రధాన రహదారిపై గుంపుగా ఉన్న పశువులు

ఈదురుగాలులతో భారీ వర్షం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రాజవొమ్మంగి మండలంలో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో కొండ కాలువలు పొంగి ప్రవహించాయి. మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండకాసి సాయంత్రం సమయంలో ఆకాశంలో నల్ల మబ్బులు కొమ్ముకొని సుమారు రెండు గంటల పాటు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. నెల రోజులుగా వరుణుడు ముఖం చాటేయం, భానుడు ప్రతాపంతో రైతులు వేసిన వరి పొలాలు ఎండిపోయాయి. వర్షం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో గురువారం భారీ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని రోజులు ఈ విధంగానే వర్షాలు పడితే పంటలు పండే అవకాశం ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి నాణ్యత పరీక్షపై శిక్షణ

ప్రజాశక్తి-అడ్డతీగల

లయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో, న్యూఢిల్లీకి చెందిన ఎస్ఎం.సాగల్ ఫౌండేషన్ వారి సహకారంతో తాగునీరు నాణ్యత పరీక్షపై మండల కేంద్రంలో గురువారం శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనికి అల్లూరి సీతారామరాజు జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లా నుంచి సుమారుగా 25 మంది ఆదివాసీ యువతీ యువకులు హాజరయ్యారు. తాగునీరు ఏ విధంగా కలుషితమవుతుంది (భౌతిక కలుషితం, రసాయనిక కలుషితం, సూక్ష్మజీవుల ద్వారా కలుషితం) గురించి అవగాహన కల్పించారు. తాగే నీటిలో ఫ్లోరిన్, క్లోరిన్, ఐరన్, నైట్రేట్, పిహెచ్, టర్బిడిటీ, రేసిడియల్ క్లోరైడ్ మైక్రోబయాలజికల్ వంటి పది రకాలైన టెస్టులు గురించి శిక్షణ ఇచ్చారు. ఇందులో పాల్గొన్న అభ్యర్థులకు కోర్స్ కంప్లేషన్ సర్టిఫికెట్లు, ఫీల్డ్ వాటర్ టెస్టింగ్ కిట్లు అందజేశారు. ఫీల్డ్ టెస్ట్ కిట్లు తీసుకున్న అభ్యర్థులు వారి వారి గ్రామాల్లో వాటర్ టెస్టింగ్‌లు నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో లయ సంస్థ కోఆర్డినేటర్ బుల్లియ, పాల్గొన్నారు.

శిక్షణలో పాల్గొన్న గిరిజన యువతీ యువకులు

'ప్రాణ హాని ఉంది.. రక్షణ కల్పించండి'

ప్రజాశక్తి-మారేడుమిల్లి

తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లాల రాజ్ కుమార్ రెడ్డి గురువారం మారేడుమిల్లి ఎస్సై ఎన్.రాముకి ఫిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి తన పేరు అడుగుతూ కొంతమంది అగంతకులు వెతుక్కుంటూ వచ్చారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. వారం రోజుల క్రితం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పర్యటనలో వాళ్లను నేను ప్రశ్నించినందుకు గాను నాపై దాడికి ప్రయత్నిస్తున్నారన్న అనుమానం ఉందని పేర్కొన్నారు. బుధవారం రాత్రి పనులు ముగించుకొని ఇంటికి వెళుతున్న సమయంలో కూడూరు దగ్గర గ్రీన్ పార్క్ వద్ద పడుకుందామని వెళ్లానని, ఇంతలో అక్కడికి ఎవరో తెలియని అగంతుకులు వచ్చి నా వ్యక్తిగత సమాచారం అడిగారని ఆ రిసార్ట్‌లో పనిచేస్తున్న కత్తుల బొర్రం రెడ్డి తనకు తెలిపారని, ఒక తుపాకీ, మారణాయుధాలు పట్టుకొచ్చారని వాచ్‌మెన్ తనకు తెలిపారని రాజ్ కుమార్ రెడ్డి ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు రక్షణ కల్పించాలని కోరారు.

ఎస్ఐకి వినతిపత్రం ఇస్తున్న టిఎన్ఎస్ఎఫ్ నేత

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

నేటి నుండి నేత్రదాన పక్షోత్సవాలు

ప్రజాశక్తి-పాడేరు: ఈ నెల 25 నుండి సెప్టెంబర్ 8 వరకు నిర్వహించే 38వ జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల పోస్టర్లను గురువారం అల్లూరి జిల్లా కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి సహకారంతో అవగాహన, ర్యాలీ నిర్వహించాలని పిలుపు నిచ్చారు. నేత్ర దానం పై ఆసక్తి ఉన్నవారు ప్రతిజ్ఞ పత్రంపై సంతకం చేసి జిల్లా అంధత్వ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. నేత్ర దానంపై ఆసక్తి ఉన్న వారు వేరుగా మోహిసిన్ ఐ బ్యాంక్ ను సంప్రదించాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు: ఫోన్: 9246624400కు సంప్రదించాలని సూచించారు.

హెచ్‌డబ్ల్యుఒపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: విద్యార్థులకు భోజన మెనూను సక్రమంగా అమలు చేయని డుంబ్రిగుడ హెచ్‌డబ్ల్యుఒపై కఠిన చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం అల్లూరి జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, మెనూ అమలు కాకపోవడంతో విద్యార్థులకు పౌష్టికాహారం అందని పరిస్థితి నెలకొంటుందన్నారు. హెచ్ డబ్ల్యు ఓ స్థానికంగా ఉంటూ విద్యార్థుల సంరక్షణ చూసుకోవలసిన బాధ్యత ఉందన్నారు. అక్కడి హెచ్ డబ్ల్యుఓ, స్థానికంగా ఉండకపోవడంతో విద్యార్థులకు రాత్రివేళల్లో సమస్యలు వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆశ్రమ పాఠశాల వసతి గృహాలను మండల ఏటిడబ్ల్యుఓ, పర్యవేక్షణ చేయడంలేదన్నారు. ఈ ఒక్క పాఠశాలలోనే కాకుండా మండలంలో అన్ని ఆశ్రమ పాఠశాలల్లో ఇదే పరిస్థితి ఉందని చెప్పారు. తక్షణమే మెనూ అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్న వార్డెన్లపై చర్యలు తీసుకుని, విద్యార్థులకు సక్రమంగా మెనూ పెట్టే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థులతో ఆందోళన చేయాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గిడుగు రామమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పిఒ అభిషేక్

గిడుగు రామమూర్తికి ఘన నివాళి

ప్రజాశక్తి - పాడేరు : గిడుగు రామమూర్తి జయంతి వారోత్సవాల సందర్భంగా ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ ఘనంగా నివాళి అర్పించారు. రామ్మూర్తి చిత్రపటానికి ఐటిడిఏ కార్యాలయంలో గురువారం పూలమాలవేశారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ, తెలుగు భాషకు, వ్యవహారిక భాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారులు వీ.ఎస్. ప్రభాకర్, ఎం. వెంకటేశ్వరరావు, ఐటీడీఏ పరిపాలనాధికారి ఎం. హేమలత పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలను పూర్తి చేయండి

ఐటిడిఎ పిఒ అభిషేక్

మాట్లాడుతున్న పిఒ అభిషేక్

ప్రజాశక్తి -పాడేరు : ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలను త్వరితగతిన నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని ఐటిడిఏ పి ఓ వి. అభిషేక్ ఆదేశించారు. గురువారం ఆయన కార్యాలయంలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులతో అరకు నియోజక వర్గంలో జరుగుతున్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, అంగన్వాడీ భవన నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్టోబరు నెలాఖరు నాటికి భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రాధాన్యేతర పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణపు పనులు అప్పగించి వేగంగా పూర్తి చేయాలని అరకు గిరిజన సంక్షేమ శాఖ ఇ ఇని ఆదేశించారు. ప్రాధాన్యతేతర పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు భవన నిర్మాణాలు చేయడానికి ముందుకు రాకపోతే బిల్లులు నిలుపుదల చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రాధాన్యతా భవన నిర్మాణాలు పూర్తి చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించడానికి చర్యలు చేపడతామన్నారు. ప్రాధాన్యతా భవన నిర్మాణాలు చేపట్టి మధ్యలో పనులు నిలిపేసిన కాంట్రాక్టర్లకు భవిష్యత్తులో పనులు ఇవ్వమని, అటువంటి కాంట్రాక్టర్లను హిట్‌లిస్టులో పెడతామన్నారు. పూర్తి చేసిన పనులకు ఎప్పటిప్పుడు బిల్లులు చెల్లించడం జరిగిందని తెలిపారు. ఇంజనీరింగ్ అధికారులు ప్రాధాన్యతా భవన నిర్మాణాలు పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. భవన నిర్మాణాలలో సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సేవలను వినియోగించాలని చెప్పారు. సిమెంటు, ఇసుక కొరత లేకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేసారు. భవన నిర్మాణాలకు అడ్వాన్సులు తీసుకున్న కాంట్రాక్టర్లు పనులు చేయకపోతే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ ఇఇ టి.కొండయ్య పడాల్, పిఐ యు ఇఇ కె.లావణ్య కుమార్, డిఇ. రామం, ఎఈ ఈలు తదితరులు పాల్గొన్నారు.

తారురోడ్డు నిర్మించాలని గిరిజనుల ఆందోళన

ఆందోళన చేస్తున్న సర్పంచ్ మోస్య, గ్రామస్తులు

ప్రజాశక్తి -అనంతగిరి:రెండు పంచాయతీ గ్రామలకు తారురోడ్డు తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సర్పంచ్ ఆధ్వర్యన గిరిజనులు ఆందోళన చేపట్టారు. టోకూరు పంచాయతీ సీపీఎం సర్పంచ్ కిల్లో. మొస్య ఆద్వర్యన గురువారం బల్యగుడగుడ రోడ్డు వద్ద నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా మొస్య మాట్లాడుతూ, బొర్ర మెయిన్ రోడ్డు పులమామిడి నుండి బలియగుడ, కొత్తవలస మీదుగా బొర్ర పంచాయతీ పూలగూడ. వరకు తారు రోడ్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 2018-19 సంవత్సరంలో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా మట్టి రోడ్డు వేసి పనులు పూర్తి చేయంకుడా సుమారు రూ. 22 లక్షలు స్వాహ చేశారని విమర్శించారు. 2020-21 సంవత్సరంలో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రోడ్డు పనులు చేపట్టేందుకు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ శంకుస్థాపన చేశారని, ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు చేపట్టాలని, లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గెమ్మెల. దేవన్న, గెమ్మెల .భీమరాజు, మాజీ వార్డు మెంబరు తామల చిన్నయ్య, తామల రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు

రాజ్‌మా విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి- హుకుంపేట: 90శాతం సబ్సిడీపై ఇస్తున్న రాజ్మా విత్తనాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కూడా రాజు బాబు అన్నారు. మండలంలోని హుకుంపేట డాలి గుమ్మడి రైతు భరోసా కేంద్రం వద్ద గురువారం రాజ్మా విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రైతులు ఈ పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. దీంతో పంట బీమా పథకం వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు, వ్యవసాయ అధికారి ఎం.లీలావతి పాల్గొన్నారు.

అనంతగిరి: రాజ్మా విత్తనాలను టోకూరు సిపిఎం సర్పంచ్ కిల్లో. మొస్య స్థానిక సచివాలయం కేంద్రంలో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు ఆర్థికంగా ఆదానిచ్చే రాజ్మా విత్తనాలను పంచాయతీ పరిధి గ్రామాలకు చెందిన 200 మంది రైతులకు అందజేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ సార దొన్ను, కన్వీనర్ సమరెడ్డి దొన్ను, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఉషా పాల్గొన్నారు

విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపిపి

అవగాహన కల్పిస్తున్న కళాకారులు

గంజాయి అనర్థాలపై అవగాహనకు కళాజాతా

ప్రజాశక్తి-జి.మాడుగుల: బొయితెలి పంచాయితీ మద్దిగరువు గ్రామంలో గురువారం వారపు సంతలో పోలీసుల ఆధ్వర్యంలో గంజాయి నిర్మూలనకు కళాజాతా ఏర్పాటు చేశారు. గంజాయి సాగు, రవాణాతో జరిగే అనర్థాలను గిరిజనులకు వినోదం రూపంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు

పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేస్తున్న డిఎం

జిసిసి పెట్రోల్ బంక్ తనిఖీ

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండల కేంద్రంలో జిసిసి అనుసంధాన పెట్రోల్ బంకును జిసిసి డి ఎం సింహాచలం గురువారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పెట్రోల్ పంపులు మరమ్మతులు గురవడంతో సుమారు 20 రోజుల నుండి పెట్రోల్ వినియోగి దారులకు అందుబాటులో లేకపోవడంపై పలు పత్రికల్లో వచ్చిన కథనాలకు అధికార యంత్రాంగం కదిలింది. పెట్రోల్ పంపులను పరిశీలించి త్వరలోనే వినియోగదారులకు పెట్రోలు అందుబాటులో తెచ్చే ఏర్పాట్లు చేస్తానని ఆయన తెలిపారు

10న ప్రతిఘటన సదస్సు, ర్యాలీ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : 25 ఏళ్ల దళిత విముక్తి ఉద్యమ ప్రస్థానం నేపథ్యంలో సెప్టెంబర్ 10న ప్రతిఘటనా సదస్సు, ర్యాలీలను జరపనున్నామని దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్ఎడి సమీపంలోని ఆర్అండ్ బి వద్ద ఉన్న అంబేద్కర్ భవన్ లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమానికి వక్తలుగా ద్రావిడ యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కెఎస్.చలం, ఆంధ్రాయూనివర్సిటీ ప్రొఫెసర్ పిడి.సత్యపాల్, తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు అంబటి నాగయ్య తదితరులు హాజరవుతారని తెలిపారు. వేల సంవత్సరాలుగా దళితులపై దాడులు, కుల అణచివేత జరుగుతూనే ఉందన్నారు. అన్ని అసమానతలకు మూలం మనువాదమేనని, అంబేద్కర్ ఉద్యమస్ఫూర్తితో దళిత విముక్తి అసమానతలకు వ్యతిరేకంగా అనేక సమస్యలపై పోరాడుతూ ప్రజలందరినీ సమీకరిస్తుందని చెప్పారు. 1991లో చుండూరు దళితులపై జరిగిన మారణకాండలో ఇప్పటివరకు న్యాయం జరగలేదని మండిపడ్డారు. భారత రాజ్యాంగంలోని లౌకికవాదం ప్రకారం మతం వ్యక్తిగతమైనప్పటికీ బిజెపి, ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంఘ పరివార్ సంస్థలు హిందూ మతోన్మాదాన్ని ప్రజలపై రుద్దుతూ మైనారిటీలు, దళితులు, ఆదివాసీలు, మహిళలపై దాడులకు తెగబడుతున్నాయని ఆరోపించారు.ఈ నేపథ్యంలోనే గతంలో గుజరాత్, నేడు మణిపూర్ దారుణాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. కల్బుర్గి, గౌరీ లంకేష్, నరేంద్ర దభోల్కర్‌లను మనువాదులు హతమార్చారన్నారు. రాజ్యాంగాన్ని మార్చేసే కుట్ర సాగుతుందని, ప్రయివేటీకరణ ద్వారా రిజర్వేషన్లను గండి కొడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం 28 ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సంక్షేమ పథకాలను రద్దుచేయడం దారుణమని, వాటిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంల ోకొత్తపల్లి వెంకటరమణ, కె.రవి, దళిత విముక్తి ప్రతినిధులు బి.సన్యాసమ్మ, యు.శివ, కె.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లావీ స్పోర్ట్ ప్రచారకర్తగా రణవీర్‌సింగ్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : లావీ స్పోర్ట్ బ్రాండ్ అంబాసిడర్‌గా బాలీవుడ్ సూపర్‌స్టార్ రణవీర్ సింగ్‌ను నియమించినట్లు లావీ స్పోర్ట్ వ్యవస్థాపకుడు ఆయుష్ తైన్‌వాలా చెప్పారు. గురువారం సిరిపురంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ స్టైల్‌ను కోరుకునే నేటి యువత క్రీడావసరాలను తీర్చడంలో లావీ స్పోర్ట్ నిబద్ధతను సూపర్‌స్టార్ రణవీర్‌తో అనుబంధం సూచిస్తుందన్నారు. చురుకైన జీవనశైలిని ప్రోత్సహించడం, బ్రాండ్ ప్రాథమిక సూత్రంపై నిర్మితమైన లావీ స్పోర్ట్ మన్నిక, శైలి, మెరుగైన భద్రతను వినియోగదారులకు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు సమకాలీన, బహుముఖ, నవతరం ఉత్పత్తుల విస్తృత శ్రేణితో కూడిన లావీ స్పోర్ట్ బ్రాండ్ బ్యాక్‌ప్యాక్‌లు, డఫెల్ బ్యాగ్‌లు, ల్యాప్‌టాప్ బ్యాగ్‌లు, వాలెట్‌లు మొదలైన వివిధ రకాల ఉత్పత్తులను వినియోగించుకోవాలని కోరారు.

మార్కెట్‌లోకి అప్రిలియాఎస్ఆర్ స్టార్మ్ 125 స్కూటర్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఇటాలియన్ పియాజియో గ్రూప్ 100 శాతం అనుబంధ సంస్థ ఐకానిక్ వెస్పా, స్పోర్టీ అప్రిలియా శ్రేణి స్కూటర్ల తయారీదారు పియాజియో వెహికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ లగ్జరీ పోర్ట్‌ఫోలియోకు ఆసక్తికరమైన జోడింపు చేస్తూ అప్రిలియా ఎస్ఆర్ స్టార్మ్ 125ను గురువారం విశాఖ నగర మార్కెట్‌లో విడుదల చేసింది. నాలుగు విభిన్న రంగులలో, అద్భుతమైన యాక్సలరేషన్, అసాధారణమైన ఐ-గెట్ ఇంజిన్ కలిగిన ఈ కొత్త అప్రిలియా ఎస్ఆర్ స్టార్మ్ 125సిసి, స్కూటర్, 3వాల్వ్, 4స్ట్రోక్ ఇంజిన్‌తో వస్తుందన్నారు. అప్రిలియా ఎస్ఆర్ స్టార్మ్ 125 నూతన వాహనం రూ.1,07,999 ఎక్స్-షోరూమ్ ధరలో లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

అనంత పద్మనాభుని ఘాట్‌రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి -పద్మనాభం: పద్మనాభం అనంతపద్మనాభ స్వామి కొండ ఘాట్ రోడ్డును తిరుమల తిరుపతి దేవస్థానం బృందం గురువారం పరిశీలించింది. సర్వేనెంబర్ మూడులో మూడు కిలోమీటర్లు అనంత పద్మనాభస్వామి కొండపైకి ఘాట్ రోడ్డు అధ్వానస్థితిని పరిశీలించారు. ఆలయ నిర్వహణ, ఆదాయ వ్యయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అనంతపద్మనాభుని నిత్యపూజలకు అవసరమైన సామగ్రిని సింహాచలం దేవస్థానం సమకూర్చేదని, ఇపుడు ఎనిమిది నెలలుగా పంపించడం లేదనిటిటిడి బృందానికి ఆలయ ఇఒ నానాజీబాబు వివరించారు.

పద్మనాభుని కొండఘాట్‌రోడ్డు అధ్వానస్థితిపై టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ విశాఖపట్నం క్లస్టర్ సూపరింటెండెంట్ ఎస్.కె చంద్రమౌళీశ్వర శర్మ.స్థానిక ఎంపిపి రాంబాబు ద్వారా అప్పట్లో టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి దృష్టికి తేగా, ఆయన స్పందించి పరిశీలనకు ఆదేశించారన్నారు. ఈ మేరకు ఘాట్‌రోడ్డు పరిస్థితి, అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై టిటిడికి నివేదిస్తామని బృందం ప్రతినిధులు వెల్లడించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రోగ్రాం అధికారి చల్లా సత్యనారాయణ, పి ఉమామహేశ్వరరావు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు,

రేషన్‌కార్డులు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి -గాజువాక : తమకు రేషన్‌కార్డులు మంజూరు చేయాలని కోరుతూ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇపిఎఫ్ 95 పెన్షనర్లు గురువారం గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తమకు నెలకు రూ.రెండు వేలు నుంచి రూ.మూడు వేలు లోపే పెన్షన్ వస్తుందని, దాంతో కుటుంబపోషణ, ఇతర అవసరాలకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. పెన్షన్ వస్తుందన్న కారణంతో తమకు రేషన్‌కార్డులు ఇవ్వడం లేదన్నారు. తమ ఆర్థికపరిస్థితిని దృష్టిలోపెట్టుకుని రేషన్‌కార్డుల మంజూరుకు చర్యలు చేపట్టాలని విన్నవించారు. ఎమ్మెల్యేను కలిసి విన్నవించిన వారిలో యూనియన్ నేతలు దీనబంధు, కవిత అప్పలరాజు, పెట్ల గురునాథరావు ఉన్నారు.

సంక్షేమ హాస్టళ్ల భవనాలను పునర్నిర్మించాలి

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి, తగరపువలసల్లోని సాంఘిక సంక్షేమ హాస్టళ్ల భవనాలకు తక్షణ మరమ్మతులు, ఆ తర్వాత శాశ్వత ప్రాతిపదికన పునర్నిర్మాణం చేపట్టాలని జనసేన భీమిలి నియోజకవర్గ ఇంఛార్జి పంచకర్ల సందీప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.జివిఎంసి 1,3 వార్డుల పరిధిలోని హాస్టళ్లను గురువారం సందర్శించారు. శిథిలావస్థకు చేరిన గదులను, వినియోగంలో లేని స్నానపు గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన ఇంటర్, ఆపై ఉన్నత చదువులకు వచ్చిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థులకు కేటాయించిన హాస్టళ్ల పరిస్థితి దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. శిథిలమైన హాస్టల్ గదుల్లో ఏ క్షణాన ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారన్నారు.

హిందీ భాష ప్రచారంలో కృషికి అభినందన

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వాల్తేర్ డివిజన్ అధికారిక పనులు, ఇతర రంగాల్లో రాజభాష హిందీ ప్రచారంలో చేస్తున్న కృషిని అభినందిస్తూ కమిటీ కన్వీనర్ రంజన్‌బెన్ భట్ డిఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌కు ప్రశంసా పత్రాన్ని అందించారు. గురువారం పార్లమెంటరీ అధికార భాషా కమిటీ రెండవ సమావేశం వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో నిర్వహించారు. మంత్రిత్వశాఖ సీనియర్ అధికారుల సమక్షంలో వాల్తేరు డివిజన్‌లో జరుగుతున్న అధికార భాష (హిందీ) పనులను అధికార భాషపై పార్లమెంటరీకమిటీ పరిశీలించింది. ఈ సందర్భంగా . అధికారిక భాషా నిబంధనల ప్రకారం ఇంకా శిక్షణ పొందని మరింత మంది ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలని కమిటీ సూచించింది. సమావేశంలో ఎడిఆర్ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ, రాజభాష అధికారి (ఈస్ట్‌కోస్ట్ రైల్వే) యెలీనా పాండా, రాజభాష (వాల్తేర్ ఇంచార్జ్) ఎ.వెంకటేశ్వరరావు, రైల్వే సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాన్ని అందుకున్న వాల్తేర్ డిఆర్ఎం

ప్రజా సహకారంతో రోడ్డు ప్రమాదాల నియంత్రణ

సదస్సులో మాట్లాడుతున్న డిటిసి రాజారత్నం

రహదారి భద్రతపై గీతంలో సదస్సు

ప్రజాశక్తి- మధురవాడ : మితిమీరిన రోడ్డు ప్రమాదాలు సామాజిక సమస్యగా మారాయని, అందరి సహకారంతోనే వీటిని తగ్గించవచ్చునని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ డాక్టర్ జిసి.రాజారత్నం అన్నారు. గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎన్ఎస్-ఎస్ విభాగం ఆధ్వర్యంలో, డీన్ ప్రొఫెసర్ అమిత్‌భద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన రహదారి భద్రత సదస్సులో రాజారత్నం మాట్లాడుతూ ఏటా రోడ్డు ప్రమాదాల్లో 1.5 లక్షల మంది ప్రాణాలు కోల్పోతుండగా, 4.5 లక్షల మంది క్షతగాత్రులౌతున్నారన్నారు. రహదారి భద్రతకు ప్రభుత్వాలు ఏటా రూ.1.5లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నా, ప్రజాసహకారం లేనందువల్లే ప్రమాదాలు కొనసాగుతున్నాయన్నారు. మితిమీరిన వేగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడమే రోడ్డు ప్రమాదాలు అధికంగా జరగడానికి కారణమన్నారు. కార్యక్రమంలో మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ బుచ్చిరాజు మాట్లాడుతూ, రహదారి ప్రమాదాలకు కారణాలను, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘన వల్ల కలిగే అనర్థాలను వివరించారు. గీతం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ షేక్‌షంషుద్దీన్, సెక్యూరిటీ ఆఫీసర్ రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రహదారి నిబందనలు పాటిస్తామని, హెల్మెట్ ధరిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతులకు నివాళులర్పించారు

పూల ధరలకు రెక్కలు

ప్రజాశక్తి -ఆనందపురం: శ్రావణమాసం, రెండవ శుక్రవారం, వరలక్ష్మి వ్రతం పర్వదినం కావడంతో ఆనందపురం పూల మార్కెట్ మహిళలతో కిక్కిరిసిపోయింది. పూజాసామగ్రి ధరలు ఆకాశాన్నంటగా, పువ్వుల ధరలకు అమాంతంగా రెక్కలు వచ్చేశాయి, సామాన్యభక్తులు కొనుక్కోలేనంత భారీస్థాయికి పూలరేట్లు పెరిగిపోయాయి. దీంతో పూజకు సరిపడా కొద్దిపాటి పూలతో సరిపెట్టుకునే పరిస్థితి నెలకొంది.

ఆనందపురం జంక్షన్ వేములవలస వద్ద మహాత్మాగాంధీ మార్కెట్‌లో పూలకు ఒక ప్రత్యేకత ఉంది. ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు విశాఖ నగరవాసులు పండుగలు, ఫంక్షన్లు, ఇతర ఏ అవసరమైనాపూల కోసం నేరుగా ఈ మార్కెట్‌కు వచ్చి కొనుగోలు చేసి తీసుకెళతారు. అయితే ప్రస్తుతం శ్రావణమాస పూజలకు పూల అవసరం ఎక్కువ కావడంతో వాటి డిమాండ్‌కు తగ్గట్టుగానే ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. నిన్నమొన్నటి వరకు వందల్లో ఉన్న కిలో పూల ధరలు, ఇపుడు దాదాపు పదిరెట్లు దాకా పెరిగి, వేలకు చేరాయి. కిలో కనకాంబరాలు రూ.3వేలు, మల్లెపువ్వులు కిలో రూ.రెండు వేలు, జాజులు కిలో రూ.1500, చామంతి పూలు, గులాబీలు కిలో రూ.500 పైబడే పలుకుతోంది. సాధారణ రోజుల్లో కనకంబరాలు కిలో రూ.500, మల్లెలు రూ.400, చామంతి రూ.150, గులాబీలు రూ.వందకు అటూఇటుగా ఉండేవి. అనందపురం మార్కెట్లో 40 పూల దుకాణాలు ఉండగా, వీరికి బెంగళూరు, కలకత్తా, రాజమండ్రి తదితర ప్రాంతాల నుండి పూలు వస్తుంటాయి. మామూలు రోజుల్లోనే లక్షల్లో జరిగే పూల వ్యాపారం, ప్రస్తుతం శ్రావణంలోరూ.కోట్లకు చేరింది. ప్రజలు అవసరాలను ఆసరాగా చేసుకుని వ్యాపారస్తులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచేసి సొమ్ము చేసుకుంటున్నారని సామాన్యులు, భక్తులు ఆరోపిస్తున్నారు. నిత్యం అధికమొత్తంలో పూల వ్యాపారం సాగే ఆనందపురం మార్కెట్‌లో ధరల స్థిరీకరణ, నియంత్రణపై అధికారులు దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

సీతమ్మధార : శ్రావణమాసం రెండో శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకుని గురువారం సీతమ్మధార రైతుబజార్ వినియోగదారులతో కిటకిటలాడింది.పూజాసామగ్రి ధరలు విపరీతంగాపెరిగిపోయాయి. ముఖ్యంగా పూలు, పండ్ల ధరలు భారీగాపెంచేయడంతో కొనేందుకు సామాన్యప్రజలు ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సి వచ్చింది.

వేముల వలస పూల మార్కెట్

ఆర్థిక ప్రగతికి సముద్ర వాణిజ్యం దోహదం

గీతం సదస్సులో కమాండోర్ కె.శ్రీకాంత్

ప్రజాశక్తి- మధురవాడ : దేశఆర్థిక ప్రగతికి భద్రతతో కూడిన సముద్ర వాణిజ్యం దోహదపడుతుందని నౌకాదళ విశ్రాంత అధికారి కమాండోర్ కె.శ్రీకాంత్ అన్నారు. దేశంలోని 7516.6 కిలోమీటర్ల తీరప్రాంతాన్ని రక్షించుకోవడం ఎంత ముఖ్యమో, ఇతర దేశాలతో సంబంధాలను మెరుగు పరుచుకోవడం కూడా అంతే ముఖ్యమన్నారు. గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో డైరక్టర్ ప్రొఫెసర్ అనితారావు అధ్యక్షతన 'భారతదేశ మారీటైమ్ చరిత్ర, అవకాశాలు, సవాళ్లు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, ప్రపంచంలో 95 శాతం వాణిజ్యం సముద్రాల ద్వారానే జరుగుతోందని,.భారతీయ సముద్ర ప్రాంతాన్ని ఆధారంగా చేసుకుని 36 దేశాలు వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. ప్రపంచ దేశాలలో ఆర్థిక సంక్షోభాలకు ఒక్కోసారి సముద్ర వాణిజ్యంలో నష్టాలు కారణమౌతున్నాయన్నారు. దేశభద్రతను కాపాడు కుంటూనే, ఆర్థిక అవసరాలకు తగిన విధంగా సముద్ర వాణిజ్య రంగాన్ని ప్రోత్సహించడంలో భారత నౌకాదళం కీలకపాత్ర పోషిస్తోందన్నారు. అయితే అంతర్జాతీయ చట్టాలపై అవగాహన ఇంకా పెరగాల్సి ఉందన్నారు. న్యాయ విద్యను అభ్యసించే యువత వీటిపై పట్టు సాధించాలని సూచించారు.

శ్రీకాంత్‌ను అభినందిస్తున్న ప్రొఫెసర్ అనితారావు

వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యం

ప్రజాశక్తి -ములగాడ : వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కన్వీనర్లు, గృహ సారథులు పనిచేయాలని వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, జెసిఎస్ కన్వీనర్ బోగవల్లి నాగభూషణం అన్నారు. గురువారం జివిఎంసి 40వ వార్డు పరిధిలోని సచివాలయాల కన్వీనర్లు గుండపు అశోక్, దండి శ్యామ్, పెంట్లా బాలకష్ణ, మీసాల సత్యనారాయణ, శరగడం గంగరాజు నేతృత్వంలో కన్వీనర్లు, గృహ సారథులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కన్వీనర్లు, గృహసారథులకు ఉచిత బీమా సౌకర్యం కల్పించారన్నార. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం ద్వారా రానున్న ఎన్నికల్లో వైసిపి విజయానికి బాటలు వేయాలని కోరారు. పశ్చిమ నియోజకవర్గంలో ఆడారి ఆనందరావు విజయమే అందరి లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వార్డు అధ్యక్షులు వరపల మహేష్, గంటా వర్మ పాల్గొన్నారు.

రోగులకు ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి -గాజువాక : 65వ వార్డు అశోక్‌నగర్ సామాజిక భవనంలో బెస్ట్‌విజన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో గురువారం నిర్వహించిన మెగా కంటి వైద్యశిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కంటి ఆరోగ్య విషయంలో జాగ్రత్తగా ఉండాలని, సమస్య వస్తే వెంటనే వైద్యసేవలు పొందాలన్నారు. పిల్లలను సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలని సూచించారు. శిబిరంలో డాక్టర్ పావని వాడపల్లి పాల్గొని పలువురికి కంటిపరీక్షలు చేశారు. అవసరమైన వారికి వార్డు కార్పొరేటర్ నరసింహపాత్రుడు ఉచిత మందులను అందజేశారు..కార్యక్రమంలో స్థానిక నేతలు మద్దాల అప్పారావు, లోకనాథం, నాగిశెట్టి శ్రీనివాస్, సంజీవరావు, గౌరీ శంకర్, యడ్ల లక్ష్మీ, అమ్మాజీ, మార్కెటింగ్ హెడ్ వర్మ పాల్గొన్నారు

విద్యార్థినులకు కంటి పరీక్షలు

తగరపువలస : చిట్టివలస జెడ్పి బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు గురువారం ఉచిత కంటిపరీక్షలు నిర్వహించారు. మోషన్ స్కూల్ హెల్త్ ఐ కేర్ ప్రాజెక్ట్, పెదవాల్తేరు విశాఖ హాస్పిటల్ ట్రస్ట్ సహకారంతో శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, సత్యసాయి సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 212 మందికి కంటి అద్దాలు అవసరమని నిర్ధారించారు. హెచ్ఎం రోజామణిజోనల్ కో ఆర్డినేటర్ ఎంవి సత్యసాయి కుమార్, వంశీకృష్ణ పాల్గొన్నారు